క్లుప్తంగా

రాజరాజేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసం ప్రారంభ అమావాస్య సందర్భంగా గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో వేంచేసిన రాజరాజేశ్వరీ అమ్మవారికి ఆదివారం పాలు, పసుపు, కుంకుమ నీటితో అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణ, శ్రావణమాసాన్ని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలోని మహాలక్ష్మీ అమ్మవారికి పాలతో భక్తులు అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు బంకుపల్లి శేషాచార్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాల పురస్కారాలు ప్రదానం


అవార్డులతో నీరజ శిష్య బృందం

శ్రీకాకుళం కల్చరల్: అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు డాక్టర్ టి.నీరజా సుబ్రహ్మణ్యం శిష్యులు నర్తన బాల జాతీయ అవార్డు–2024 అందుకున్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో ఏలూరు అభియన నృత్య భారతి వారిచే కానాగుల గురుమూర్తి కళావేదిపై జరిగిన శాస్త్రీయ నృత్యం పోటీలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన డి.విశిష్ట, డి.తనుష, పి.జోషతలు కూచిపూడి నృత్యంలో పురస్కారాలతో, నృత్య దర్శకురాలు నీరజకు అభినందన సత్కారాలు జరిగాయి.

అంగన్‌వాడీ కేంద్రానికి శ్లాబ్ నిర్మాణం


శ్లాబ్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడలోని అంగన్‌వాడీ కేంద్రం–1 భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం శ్లాబ్ నిర్మించారు. సర్పంచ్ ముద్దాడ శంకర్ శ్లాబ్ పనులను ప్రారంభించారు. భవనం త్వరితగతిన పూర్తిచేసిన ఐసీడీఎస్‌కు అందజేయనున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వినియోగించే కషాయాల తయారీపై రైతులకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్ సువ్వారి సన్యాసిరావు ఆధ్వర్యంలో శిక్షకులు శిక్షణ ఇచ్చారు. దశ పత్ర కషాయం తయారీ ప్రయోజనాలను వివరించారు. వరి పంటకు వచ్చే చీడ, పీడలు, తెగుళ్లు వంటివి కషాయం వల్ల నియంత్రించవచ్చన్నారు. అందుబాటులో ఉన్న ఆకులను ఉపయోగించి ఈ కషాయాన్ని తయారు చేస్తున్నట్లు వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శిక్షకులు తులసి, పూర్ణ పాల్గొన్నారు.

ఆదిత్యునికి వెండి వస్తువులు వితరణ


వెండి సామగ్రిని ఈవోకు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి విశాఖకు చెందిన ఎన్.శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యులు వెండి ఉద్ధరణి, పంచిపాత్రలను విరాళంగా సమర్పించారు. 405 గ్రాముల బరువు గల ఈ రెండు వస్తువులను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు.

చిన్నారులకు దేశభక్తి గీతాల పోటీలు


పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు దేశభక్తి గీతాల పోటీలు జరిగాయి. 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు క్లబ్ నిర్వాహకులు బి.ఎం.ఎస్.పట్నాయక్, ప్రసాద్, ఎల్.దీప్తి ఉన్నారు.

విద్యార్థుల అగచాట్లు!


ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం ఉన్నత పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

- ట్యాబ్‌లకు టాటా.. టోఫెల్‌కు మంగళం
- మధ్యాహ్న భోజనం నాణ్యత అంతంతమాత్రమే
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యను నిర్వీర్యం చేసేలా కనిపిస్తుంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించే ట్యాబ్‌లకు టాటా చెప్పింది. టోఫెల్ శిక్షణ తరగతులు, పరీక్షలకు మంగళం పాడింది. మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతను తగ్గించుకుంటూ పోతోంది. పాఠశాలలు తెరిచిన రోజూ అందజేయాల్సిన స్టూడెంట్ కిట్లు ఇప్పటికీ చాలామంది పిల్లలకు అందలేదు. టీచర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో విద్యార్థులకు తరగతులు జరక్కా, కొన్ని సబ్జెక్టుల్లో అసలు టీచర్లే లేక నానా అగచాట్లు పడుతున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో శ్రీకాకుళం, గార మండలాలు ఉన్నాయి. ఈ రెండు మండలాల పరిధిలో మొత్తం ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 218 ఉన్నాయి. వీటిల్లో 18,430 మంది విద్యార్థులు చదువుతున్నారు. శ్రీకాకుళం అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం 120 పాఠశాలలు, గార మండల పరిధిలో 98 పాఠశాలల ఉన్నాయి.

శ్రీకాకుళం విషయానికొస్తే..

మున్సిపల్ కార్పొరేషన్‌లో 38 పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు 3, ఎంపీపీ/జిల్లా పరిషత్ పాఠశాలలు 74, కేజీబీవీ ఒకటి, ట్రైబల్ వెల్ఫేర్ ఒకటి, ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ స్కూళ్లు రెండు కలిపి ఉండగా ప్రభుత్వ పాఠశాలలు మూడు ఉన్నాయి.

- గార విషయానికొస్తే ప్రభుత్వ పాఠశాలలు మూడు, ఎంపీపీ/జిల్లా పరిషత్ 93, ఏపీఆర్ఎస్ ఒకటి, కేజీబీవీ ఒకటి ఉన్నాయి.

టీచర్లు లేక ఇబ్బందులు

నియోజకవర్గ పరిధి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మొత్తం 957 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. ఇప్పటికీ 35 వరకు ఖాళీలు ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఉపాధ్యాయుల్లేక, పాఠాలు జరగక అటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మధ్యాహ్న భోజనం లోపభూయిష్టం

జగనన్న గోరుముద్ద స్థానంలో పీఎం పోషన్–గోరుముద్దగా మార్చి..డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి పథకంగా అమలు చేస్తున్నారు. అయితే పథకాలకు పేర్లు మార్చినంతా సులువుగా పథకాన్ని పక్కాగా అమలుచేసేలా చర్యలు తీసుకోవడంలేదు. శ్రీకాకుళం, గార మండలాలకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం పథకం భోజనాలు అందుతున్నాయి. అయితే గతంలో ఉన్నంత నాణ్యత, రుచి ఉండటంలేదని విద్యార్థులు చెబుతున్నారు. రాగిమాల్ట్ అందజేయడంలేదని వాపోతున్నారు.

గాడితప్పిన విద్యా వ్యవస్థ

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థ గాడితప్పుతుంది. ఎచ్చెర్ల మండలంలో ఉన్నత పాఠశాలలు 16, ప్రాథమికోన్నత 5, ప్రాథమిక 82, గురుకుల, మోడల్, కేజీబీవీ ఐదు మొత్తం 108 పాఠశాలలున్నాయి. 541 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 9314 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వం అమ్మ ఒడి రూ.13వేలు అందజేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం కింద రూ.15 వేలు అందజేస్తామని చెప్పి ఇంతవరకు ఈ పథకాన్ని అమలు చేయలేదు. మరో పక్క విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు (పుస్తకాలు, షూలు, యూనిఫాంలు) అందజేయవల్సి ఉండగా.. కొత్తగా ప్రవేశాలు పొందిన వారికి, సైజులు సరిపడని వారికి అందజేయలేదు. పలుచోట్ల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు కొరత ఉంది. దీర్ఘకాళిక సెలవులు పెట్టిన చోట సైతం ఈ సమస్య ఉంది. మధ్యాహ్నం భోజనంపై పర్యవేక్షణ తగ్గటం, ఏజెన్సీలు మార్పులు చేయాలని కొన్ని చోట్లు ఒత్తిళ్ల కారణంగా నాణ్యత దెబ్బతింటుంది. విద్యా వ్యవస్థను గాడిన పెట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థులు

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తగ్గింది. మండలంలోని 81 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 16 ఉన్నత పాఠశాలలున్నాయి. గత ఏడాది 2023–24లో 8400 విద్యార్థులు ఉండగా.. ప్రస్తుతం 2024–25లో 7600 మందికి పడిపోయింది. ఇందుకు ప్రధాన కారణం పాఠశాలల్లో అమ్మ ఒడి పథకం అమలు కాకపోవడం, స్టూడెంట్ కిట్లు సక్రమంగా ఇవ్వకపోవడమే. ఆరు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉంది. మిగతా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. పుస్తకాలు పూర్తి స్థాయిలో అందకపోవడంతో పాత విద్యార్థుల నుంచి పుస్తకాలు సర్దుబాటు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో అందని కిట్లు..


ఎచ్చెర్ల: పాఠశాలలకు గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యాకానుక కిట్లు పూర్తిస్థాయిలో అందించేవారు. ఈ ప్రభుత్వం ఇంతవరకు పూర్తిస్థాయిలో అందించలేదు. లావేరు మండలంలోని ఇప్పటివరకూ 5,190 కిట్లు పంపిణీ చేపట్టారు. ఈ కిట్లులో కూడా వస్తువులు పూర్తిస్థాయిలో లేవని విద్యార్థులు అంటున్నారు. కొన్ని పాఠశాలల్లో కిట్టులో ఉన్న వస్తువులు కూడా పూర్తిగా ఇవ్వలేదు. పుస్తకాలు, బూట్లు ఇచ్చారు. బ్యాగ్‌లు అరకొరగా అందించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో కూడా నాణ్యత కొరవడుతుందని విద్యార్థులు అంటున్నారు.

ఉపాధ్యాయుల కొరత..

జి.సిగడాం: మండలంలో 282 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 115 మంది ఉన్నారు. మ్యాథ్స్, ఇంగ్లిష్, సైన్స్ బోధించే ఉపాధ్యాయులు ఇద్దరు చొప్పన ఉండాల్సిన చోట ఒక్కొక్కరు ఉన్నారు. యూపీ 15, 39 ఎంపీపీ పాఠశాలున్నాయి. 167 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కొత్తగా చేరిన విద్యార్థులకు అరకొరగా కిట్లు పంపిణీ చేశారు.

మధ్యాహ్నం భోజనంలోనూ గతంలో కంటే నాణ్యతాప్రమాణాలు తగ్గాయని విద్యార్థులు చెబుతున్నారు.


శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ మున్సిపల్ హైస్కూల్‌లో భోజనాల నాణ్యతను పరిశీలిస్తున్న శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి (ఫైల్)


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ఓ ప్రభుత్వ విద్యాసంస్థలో దుస్థితి ఇది


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం రూరల్ పరిధిలోని ముక్తంపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఉన్న విద్యార్థులు

విలువైనది స్నేహబంధం


స్నేహితుల దినోత్సవంలో స్టార్‌వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: స్నేహం మాత్రమే ప్రపంచంలోనే అత్యంత విలువైనదని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్న ఈ రోజుల్లో స్నేహితుడు మాత్రమే ప్రతిఫలం ఆశించకుండా మన మంచిని కోరుకుంటారన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్ షిప్‌తో కలిసి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్నేహితుడు ఎలాంటి రక్త సంబంధం కాకపోయినా మనుషుల హృదయాంతరాల్లో నుంచి పుట్టికొని వస్తారన్నారు. నిజమైన స్నేహితుడు జీవితం చివరి వరకు తోడుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కోఆర్డినేటర్ శాసపు జోగి నాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పీజీ గుప్తా, సీనియర్ జర్నలిస్టులు బొడ్డేపల్లి ప్రసాద్‌రావు, సత్యం, ఇస్కాఫ్ శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు ఎం.వి.మల్లేశ్వరరావు, జి.వి.నాగభూషణ్, బుడుమూరు శ్రీరాములునాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.లక్ష్మి, డాక్టర్ ఎం.వాసుదేవాచారి, సింహాద్రి వేణుగోపాల్ ,గోలీ ఉమామహేశ్వరరావు, గోలీ సంతోష్, సుగంధం సంజీవరావు, గొర్ల వాసుదేవరావు, గుడ్ల జగ్గారావు పాల్గొన్నారు.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచే శ్రావణమాస సందడి
- ఊరంతా లక్ష్మీదేవి పూజలు
- మార్కెట్లో పూలకు గిరాకీ


సంతోషిమాత అమ్మవారు


మార్కెట్లో పూల అమ్మకాలు

శ్రీకాకుళం కల్చరల్ : సకల శుభాలకు నిలయం శ్రావణమాసం. ముఖ్యంగా మహిళలు విశేష పూజలతో అమ్మవారిని కొలుస్తారు. ఆదివారం అమావాస్యతో ఆషాఢ మాసం పూర్తికానుండగా.. సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుంది.

9 నుంచి శ్రావణ శుక్రవార పూజలు

శ్రావణ మాసంలో వచ్చే అన్ని శుక్రవారాల్లో శ్రావణ లక్ష్మీ పూజలు జరుగుతాయి. ఆగస్టు 16న వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో చేసేందుకు మహిళలు సమాయత్తమవుతున్నారు. వరలక్ష్మీ వ్రతం నాడు అమ్మవారికి కలశ పెట్టి నిండుగా అలంకరించి పూజలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని మహిళల నమ్మకం.

లక్ష దజన్ల గాజులతో అలంకరణ..

శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాల అలంకరణలతో సిద్ధం చేస్తున్నారు. బలగ నాగావళి తీరాన ఉన్న బాల త్రిపుర కాలభైరవాలయంలో లక్ష దజన్ల గాజులతో ఆలయం అలంకరణ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రతి శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం, గుడివీధిలోని ఉమారుద్రకొటేశ్వరస్వామి దేవాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారు, పాతబ్రిడ్జి వద్ద కనకదుర్గ ఆలయం, రెడ్డిక వీధిలోని విజయదుర్గదేవి ఆలయం, చిన్నబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, కొత్తబ్రిడ్జి వద్ద చిం దత్తనాథ క్షేత్రంలోగల గాయత్రీ మాత ఆలయం, గోవిందనగర్‌కాలనీలోని శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయాలు ముస్తాబవుతున్నాయి .

పూల అమ్మకాల సందడి..

వరలక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహిస్తారు. ఇందుకోసం పూల వాడకం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో చేమంతులు కేజీ రూ.800, గులాబీలు కేజీ రూ.600, బంతిపూలు కేజీ రూ.500, విరజాజులు కేజీ రూ.వెయ్యి, కొబ్బరికాయలు ఒక్కొక్కటి రూ.30, అరటిపండ్లు పెడ రూ.80లుగా అమ్ముతున్నారు.

8 అవతారాలలో అమ్మవారు..

నానుబాల వీధిలోని విజయదుర్గ ఆలయంలో 8 విశేష అవతారాలలో అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ తెలిపారు. 6న ఆదిలక్ష్మీగా, 9న ధాన్యలక్ష్మీగా, 13న ధైర్యలక్ష్మీగా, 16న గజలక్ష్మీగా, 20న సంతానలక్ష్మీగా, 23న విజయలక్ష్మీగా, 27న విద్యాలక్ష్మీగా, 30న ధనలక్ష్మీ అవతారంలో అమ్మవారిని అలంకరిస్తారు.

పెద్ద కోనేరును అభివృద్ధి చేస్తా..


పెద్ద కోనేరును పరిశీలిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీలో గల పెద్ద కోనేరును అభివృద్ధి చేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని కోనేరును చిన్ననాటి స్నేహితులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు అంచుల్లో రాతికట్టు కట్టేందుకు, బోరును తవ్వించేందుకు చర్యలు చేపడతానన్నారు. ఉపాధి హామీ అధికారులతో మాట్లాడుతూ చెరువు అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు డీజీఎం శ్రీనివాసరావు, మన్నెల శ్రీనివాస్, పిన్నింటి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యసాయి యంగ్ మెసెంజర్స్ సత్యసాయి ప్రేమ తరు కార్యక్రమంలో భాగంగా మొక్కలను ఆదివారం నాటారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా గార మండలంలోని శ్రీకూర్మం, పాతపట్నం అమ్మవారి దేవాలయం ఆవరణ, నిజామాబాద్ స్కూల్ ఆవరణ, అప్పోజీపేట ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గార మండల యూత్ కోఆర్డినేటర్ కె.ఆదినారాయణ, సాయిరాం పట్నాయక్, యువత ప్రసాద్, నర్సింహమూర్తి, నాయుడు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం సమీపంలో జూద శిబిరంపై ఆదివారం సాయంత్రం ఎచ్చెర్ల ఎస్‌ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ. 36,400 స్వాధీనం చేసుకున్నారు. రెండు బైక్‌లు, మూడు ఫోన్లు సీజ్ చేశారు.

తెలుగు భాషోన్నతికి కృషి


వక్త శరత్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో తెలుగు దనానికి పేరొందిన కరుణశ్రీ వంటి సహజ కవులను తలచుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పలువురు వక్తలు అన్నారు. అందరూ తెలుగు భాషా ఉన్నతికి కృషి చేయాలన్నారు. నగరంలోని శాంతి నికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక 95వ నెల సాహితీ సమావేశం ఆదివారం జరిగింది. కళాశాల అధినేత, తెరవే గౌరవ సలహాదారు సురింగి మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు ముఖ్య వక్తగా ప్రసంగించారు. పద్య, గద్య రచనలతో అలరించిన జంధ్యాల పాపయ్య శాస్త్రి సాహితీ మూర్తి మత్వాన్ని ఉదాహరణలతో వివరించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషా ఉన్నతికి చేయాల్సిన కృషిపై కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు, కోమలరావు, ఎం.శ్రీనివాసరావు, ఇద్దిపాపయ్య, నిక్కు హరిసత్యన్నారాయణ, ఐ.ఎస్.సి.ప్రసాద్, ముట్నూరు ఉపేంద్రశర్మ, వి.,రాజారావు, పూడి జనార్దనరావు, తంగి ఎర్రమ్మ, లీలారెడ్డి, ఉమాకవి, బి.జగన్నాధరావు, ఎస్. ఈశ్వరరావు మాట్లాడారు. వక్త శరత్‌బాబును సత్కరించారు.

లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం


ప్రమాణ స్వీకారణ చేస్తున్న నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారి లయన్స్‌క్లబ్ 316–ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్ వర్మ అన్నారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2024–2025 సంవత్సరానికి నియమితులైన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు అతిథిగృహంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1917లో లయన్స్‌క్లబ్ ఏర్పడిందని, ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉండి ఉత్తమ క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ముఖ్యఅతిథి పాల్గొన్న శ్రీకాకుళం నగర కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ప్రపంచంలో సేవ పరంగా లయన్స్‌క్లబ్‌కు ప్రత్యేకస్థానం ఉందన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. తన సంపాదనలో సుమారు 20 శాతం సమాజసేవకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడుగా డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శిగా డాక్టర్ పైడి సింధూర, కోశాధికారిగా జోగి భారతి, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, బరాటం విశ్వేశ్వరరావు, డైరెక్టర్‌గా పొట్నూరు నరేష్, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా ఉర్లాం శివతేజ, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా బరాటం కృష్ణచైతన్య, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఎం.కె.మిశ్రో ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు దుప్పల వెంకటరావు, ఎన్ని ధనుంజయరావు, పూడి తిరుపతిరావు, బలివాడ మల్లేశ్వరరావు, ససపల నరసింహమూర్తి, పీజే నాయుడు, అంధవరపు సంతోష్, చింతాడ రవికుమార్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, బాదాన దేవభూషణరావు, హారికా ప్రసాద్ ఉన్నారు.

ఆనందంగా స్నేహితుల దినోత్సవం


ఒకే వేదికపై మహిళా యోగా టీం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పలుచోట్ల స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం సందడిగా జరుపుకున్నారు. ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన యోగా బృందం సభ్యులంతా ఓ హోటల్‌లో కలుసుకొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అలాగే 1976లో మున్సిపల్ హైస్కూల్‌లో పదో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా రివర్ వ్యూ పార్కులో కలుసుకున్నారు.